అగ్ని గుండాలు

కంచర్ల రమణ

తలుపుమీద ఎవరో టకటకమని శబ్దం చేయడం వినగానే, వీధి ద్వారం వైపు చూశాడు సీతాపతి.

వెలుపల ద్వారంవద్ద యాభైయేళ్ళ వ్యక్తి నించుని వున్నాడు. రాజకీయ నాయకుడిలా, తెల్లని పంచె, తెల్లని చొక్కా ధరించి వున్నాడు. కాళ్ళకు ఆకు చెప్పులు.

సీతాపతి తనవైపు తిరగ్గానే, చిరునవ్వు నవ్వి "లోపలికి రావచ్చా?" అని అడిగాడా వ్యక్తి.

"రండి! రండి!" అంటూ ఆ వ్యక్తిని లోనికి ఆహ్వానించి సాదరంగా ఓ కుర్చీలో కూచోబెట్టాడు సీతాపతి.

"చెప్పండి ఏమిటిలా వచ్చారు?" అన్నాడు అతనికి కాస్త దూరంలో ఠీవిగా నిలుచొంటూ సీతాపతి.

"నేను 'ఆంధ్ర యువత' పత్రిక విలేఖర్ని. నన్ను నాగరాజు అంటారు" అంటూ ఆ వ్యక్తి తనను తాను పరిచయం చేసుకోగానే "నమస్కారం. నా పేరు సీతాపతి. ఎమ్. ఏ. ఫిలాసఫీ చదువుతున్నాను" అంటూ తన గురించి చెప్పకొన్నాడు సీతాపతి.

" 'నేటి యువత' అనే కొత్త శీర్షిక ప్రారంభించింది మా పత్రిక యీ మధ్య. ఆ శీర్షిక కోసం విశాఖపట్నం లోని యువకుల్ని కొందర్ని ఇంటర్వ్యూ చేసి, ఫోటోలతో సహా భోగట్టా పంపమని సంపాదకుల ఆదేశం. మీ కభ్యంతరం లేకపోతే మిమ్మల్ని ఇంటర్వ్యూ చెయ్యాలను కుంటున్నాను" తను వచ్చిన పని చెప్పకొన్నాడు నాగరాజు.

సీతాపతి వెంటనే జవాబియ్యలేదు.

ఈ మధ్య కొన్ని పత్రికలు కొంతమంది యువకులతో ఇంటర్వ్యూ జరిపి, వాటిని ఆ వ్యక్తుల ఫోటోలతో సహా ఘనంగా వేసుకుంటున్నాయి.

సీతాపతికి అలాంటి వాటిమీద సదభిప్రాయం లేదు. పత్రికలు తమ సర్క్యులేషన్ పెంచుకోవడంకోసం వేసిన యెత్తు అని అతని అభిప్రాయం.

"అబ్బే! నేను చాలా సామాన్యుడ్నండీ. మీ పత్రిక వాళ్లు ఇంటర్వ్యూ చేసి వేసుకోదగ్గ గణనీయమైన వ్యక్తిని కాను" అన్నాడు సీతాపతి, రెండు నిముషాలు పోయాక.

"అవునో, కాదో ముందు నన్ను ఇంటర్వ్యూ చెయ్యనీండి. మీ భావాలు పత్రికలో వేసుకో దగ్గవి కాకపోతే, నేనే పంపనులెండి."

నాగరాజు అలా అనడంతో సీతాపతి మరి మాట్లాడలేకపోయాడు.

"చూడండీ! నేను కనీసం గంటసేపయినా

ఇంటర్వ్యూ చేస్తాను, అంచేత మీరుకూడా కూచుంటే బావుంటుంది" అన్నాడు నాగరాజు.

సీతాపతి తనుకూడా ఓ కుర్చీలో కూర్చున్నాడు.

"సీతాపతిగారూ! మీకు దేని గురించయినా నిశ్చితాభిప్రాయం లేకపోతే లేదని చెప్పండి. ఉంటే, అది ఎలాంటిదయినా నలుగురూ ఆమోదించరన్న అనుమానం ఉన్నా, అది మీ మనస్సుకు నచ్చింది కాబట్టి ధైర్యంగా స్థిరంగా చెప్పండి. ఫరవాలేదు" అన్నాడు నాగరాజు.

అతను పెట్టిన షరతులకు తన అంగీకారం తెలియజేస్తున్నట్టుగా సీతాపతి తలూపాడు.

ఇంటర్వ్యూ ఆరంభించాడు నాగరాజు.

"ఫాషన్ల గురించి మీ అభిప్రాయమేమిటి?"

"ఫాషన్లు వుండాలి."

"అంటే, వెర్రి మొర్రి రకాలు ఎన్ని వచ్చినా అవి అంగీకరించి తీరాలి అంటారు."

"అది ఫాషను కాబట్టి, కొత్తది కాబట్టి అది ప్రతి ఒక్కరూ అంగీకరించి తీరాలని నేననడంలేదు. ఏదైనా ఫాషను మీకు నచ్చితే అది మీరు అవలంబించండి.అంతే గాని 'ఫాషన్లు మా కొద్దు' అంటూ అదే నియమంగా పాటించడం నాకిష్టంలేదు."

"ఇక్కడ నాదో సందేహం. ప్రతిదానికీ ఓ అర్థం వుండాలి. బట్టలు కట్టుకోవడంలో మన ఉద్దేశం. మన నగ్నత్వం కప్పుకోవడం. అలాంటప్పుడు. జల్ బాటం అనీ, నేరోకట్ అనీ, పారలల్స్ అనీ ఏమిటీ వెర్రితనం? టైలర్లను పోషించడానికా?"

క్షణంసేపు ఆలోచించి సీతాపతి అన్నాడు.

"మీ వాదనలో ఉన్న ప్రమాదం మీరు గుర్తించినట్లు లేదు."

"అంటే?"

"బట్టల ఉద్దేశం నగ్నత్వం కప్పుకోవడం అయినప్పుడు పాంటుగానో, పంచెగానో, చొక్కాగానో ఎందుకీ ఏర్పాటు?"

"మీ ఫిలాసఫీ ఈ విషయంలో స్పష్టం చెయ్యండి."

"సంప్రదాయం మంచిదేగాని, నవ్యత్వానికి గొడ్డలి పెట్టే. మేడల్లో వున్న మనం, మన పెద్దల సంప్రదాయం పట్టుకుని వేలాడి వుంటే, పూరిపాకల్లో నివసించి వుండే వాళ్ళం. అలాగే, పూరిళ్ళల్లో నివసించిన మన పూర్వులు రాతి గుహల్లో ఉండాల్సి వచ్చేది. కొత్తదనం సృజనాత్మక శక్తికి చిహ్నం. కొత్తదనం వద్దంటున్నామంటే సృజనాత్మకశక్తిని చంపుతున్నామన్న మాట."

"బావుంది. ఇహ యీనాటి మన ఆర్థిక దుస్థితికి కారణమేమిటి?"

"ఎవరి బాధ్యతలు వారు నిర్వహించకపోవడం."

"కాస్త వివరీకరించండి."

"మేష్టార్లు కుర్రాళ్ళు సరిగ్గా చదవడం లేదంటారు. కుర్రాళ్ళు మేష్టార్లు సరిగ్గా చెప్పడం లేదంటారు. రెండూ నిజమే కొంతవరకు. అయితే, చాలామట్టుకు తన తప్పు ప్రక్కవాడిమీదకు నెట్టేసి తప్పించుకు తిరిగే వ్యవహారమే సాగుతోంది."

"మీరనేదేమంటే, దేశంలో వున్న అనర్థాలన్నింటికీ కారణం, మనలో ఆత్మ విమర్శ లేకపోవడం."

"అవును."

"కాని, తరుణోపాయం కన్పడడంలేదు. మీరు చెప్పే పరిష్కార మార్గాలేమిటి?"

"చెప్తాను. మనిషి ఎంత కష్టపడి సంపాయించాలని పూనుకుంటే, అంత సంపాయించుకో గలిగే ఆర్థిక పద్ధతి

కావాలి. ఏనాడయినా పని చెయ్యకుండా బదకితే, ఆ రోజు తాను పస్తుండాల్సి వస్తుందేమో అన్న భయం ఉండాలి.''

''అంటే మీరు సోషలిజానికి వ్యతిరేకులన్నమాట?''

''మీ రా మాట అనే తీరు ఎలాగుందంటే నేనో దొంగనని చెప్తున్నట్టుగా ఉంది. నేను చెప్పింది జాగ్రత్తగా విని ఆలోచించండి. ప్రభుత్వం జీతాలు పెంచుతోంది. కాని ఉత్పత్తి తరుగుతోంది. ఇదే కొన్నాళ్ళు పాటు సాగితే, మనందరం పంచుకోవడానికి పేదరికం, ఆకలి, అప్పులు మిగుల్తాయి తప్ప ఇంకోటి ఉండదు.''

''ఇంగ్లీషు రాజభాషగా, బోధనా భాషగా ఉంచడంలో మీ అభిప్రాయం యేమిటి?''

''ఇంగ్లీషును మనం అంతర్జాతీయ భాషగా గౌరవించి నేర్చుకుందాం. దాంతో సరి. మన వంటింటి లెక్కలతో సహా అన్నీ ఇంగ్లీషులో ఉండాలంటే, మరి మన భాష లెందుకు? మన భాషలు ఆఖరుకు, దైనందిన పరిపాలనా వ్యవహారాలు సాగించడానికి కూడా పనికి రావంటే, మన భాషలను ఈ రోజే మర్చిపోవడానికి కృషి చెయ్యడం మంచిది.''

నాగరాజు కుర్చీలోంచి లేచాడు, సీతాపతి అనుమతి పొంది, గదిలోని వస్తువుల్ని పరిశీలించసాగాడు. సీతాపతి పుస్తకాలున్న అలమరలో మూలగా బుల్ వర్కర్ అగుపించింది.

''మీకు బుల్ వర్కర్ వాడే అలవాటుందన్న మాట?'' ఆశ్చర్యంగా కళ్ళు పెట్టి, సీతాపతివైపు తిరిగి అన్నాడు నాగరాజు.

''అవునండీ! అంతేకాదు. 'మార్నింగ్ వాక్' కూడా అలవాటుంది. వైజాగ్ బాక్సింగ్ క్లబ్బులో మెంబర్ని.''

"ఓహో! అలాగా" తల పంకించి, మళ్ళా గదిలోని వస్తువుల పరిశీలనలో పడ్డాడు నాగరాజు.

కొంచెం వాడిన మందారాలతో అలంకరించిన వెంకటేశ్వరస్వామి పటం అల్మయిరా మొదటి అరలో ఉంది.

"మీరు దేవుడన్నా, ప్రార్థనలు జరపడమన్నా నమ్ముతారన్న మాట?"

"అవును. నమ్ముతాను. మానవుడికి సంక్రమించిన సకల విద్యలూ అతడు తన మనస్సు కేంద్రీకరించ గలిగే శక్తి వల్లనే పొందాడు. ప్రార్థనలు, పూజలు ఆశక్తిని పెంచుతాయి. మనస్సుని నిశ్చలం చేయటంవల్ల మనోశక్తిని కేంద్రీకరించడం, ఆ శక్తిని కావలసిన దోవలో ప్రసరింప జెయ్యడం సాధ్యమవుతుంది" చెప్పాడు సీతాపతి.

అలా ఇంకో అరగంట అనేక విషయాలమీద సీతాపతి అభిప్రాయాల్ని పొందాడు నాగరాజు.

ఆ తర్వాత వెళ్ళిపోయాడు, సీతాపతికి "గుడ్‌లక్" చెప్పి.

2

'మీ ఇంటర్వ్యూపడ్డ పత్రిక పంపిస్తాను. చూద్దురుగాని' అన్నాడు నాగరాజు, వెళ్ళిపోయే ముందు.

రెండు నెలలయినా సీతాపతి తోటి జరిగిన ఇంటర్వ్యూపడ్డ పత్రిక సీతాపతికి రాలేదు.

గ్రంథాలయానికి పోయి ఆంధ్ర యువత పత్రిక పాత కాపీలు తెప్పించి తిరగేసి చూశాడు. ఎక్కడా తనతోటి జరిపిన ఇంటర్వ్యూ పడలేదు.

బహుశా, తన అభిప్రాయాలు సంపాదకుడికి నచ్చక పోయుండవచ్చు. సమాధాన పడ్డాడు సీతాపతి.

అయితే, వారంరోజులు తిరగకుండానే, ఇంకో విచిత్ర

మైన సంఘటన జరిగింది.

ఆ రోజు ఉదయం అయిదున్నర గంటల ప్రాంతంలో 'మార్నింగ్ వాక్' కోసం రామకృష్ణా మిషన్ బీచివరకూ వెళ్ళాడు సీతాపతి.

తిరిగి వస్తుండగా అతనికి కాస్త దూరంలో ఓ కారు వేగంగా వచ్చి ఆగింది. అందులోంచి నలుగురు యువకులు గబగబా దిగారు.

సీతాపతి వారిని మునుపెప్పుడూ చూళ్ళేదు ఊళ్లో. పొడుగ్గా జులపాలు, గుబురుగా గెడ్డాలు. మీసాలు పెంచుకుని ఉన్నారు. కళ్ళకు నల్లకళ్ళద్దాలున్నాయి. తల మీద క్రికెట్ కేప్స్ ఉన్నాయి.

వారు తిన్నగా సీతాపతిని సమీపించారు. సీతాపతికి అటూ ఇటూ ఇద్దరూ నిలుచుంటే, మూడో వ్యక్తి సీతాపతి వెనుక నిలుచున్నాడు.

నాలుగో వ్యక్తి తిన్నగా వచ్చి సీతాపతి కాలరు అందుకుని, దవడమీద టపీటపీమని రెండు గుద్దులు గుద్దాడు.

సీతాపతి దిగ్భ్రాంతుడయ్యాడు.

ఎవరు వీళ్ళు? ఎందుకు కొడ్తున్నారు తనను? తనేం చేసాడని యీ దండ ప్రయోగం?

సమ్మెట పోట్లలాంటి దెబ్బల బాధను ఓర్చుకుంటూ "ఆపండి మీ దౌర్జన్యం. ఎవర్ని చూసి ఎవరనుకుంటున్నారో?" అరిచాడు సీతాపతి.

దెబ్బలు కొట్టిన వ్యక్తి సీతాపతి మాటలు వినిపించుకోలేదు.

మరి రెండు గుద్దులు వెంటవెంటనే సీతాపతి దవడమీద కొట్టాడు.

సీతాపతికి కోపం పొడుచుకు వచ్చింది. కాని తమా యించుకున్నాడు.

"చెప్తుంటే మీకాక్కాదూ. ఎందుకు నన్ను కొడ్తున్నారు?" మళ్ళా అరిచాడు.

ఆ వ్యక్తి యింకో సారి చెయ్యి విసరబోయాడు.

దాంతో సీతాపతి కోపం నసాళానికి అంటింది.

ఇదేదో రౌడీగుంపు అనుకొన్నాడు.

గత మూడేళ్ళుగా తను బాక్సింగ్ ఛాంపియన్‌గా విశాఖ క్లబ్‌లో పేరు తెచ్చుకున్నట్టు వాళ్ళకు తెలీదు.

అంతే!

సీతాపతి ఏనుగుల గుంపులో సింహపు పిల్ల అయిపోయాడు.

తనను అంతవరకూ కొడ్తున్న వ్యక్తిని అమాంతంగా రెండు చేతుల్లో ఎత్తి నేలకు కుదేసాడు.

అతడు లేవడానికి అయిదునిముషాలైనా పడుతుంది. ఈలోపున మిగతావారు అతనిమీద ఒక్కుమ్మడిగా పడ్డారు.

మెరపుల్లాంటి ముష్టిఘాతాలతో వార్ని తగురీతిగా సత్కరించాడు.

పావుగంట నడిచింది ముష్టియుద్ధం. సీతాపతి ఒంటి మీద ఒక్కసారంటే ఒక్కసారి చెయ్యి వెయ్యలేక పోయారు ఆ నలుగురూ.

ఇహ, తమ పని ఐపోయిందనుకున్నారు కాబోలు.

తాము వచ్చిన కాల్లోకి దూకి, ఎలా వచ్చారో అలాగే తుర్రుమన్నారు రెండు నిముషాల్లో.

ఆ దుర్మార్గులకు గట్టిగానే బుద్ధి చెప్పినందుకు తృప్తిగా నిట్టూర్చి ఇంటిదోవ పట్టాడు సీతాపతి.

తన గదికి తిరిగి వస్తున్నాడన్న మాటేగాని, సీతాపతి

మనస్సులో లెక్కలేనన్ని ఆలోచనలు ముసురుకున్నాయి.

కనీసం చెప్పుకోవడానికైనా తనకు శత్రువులు లేరు.

తనది రాజులవంశం. తాతతండ్రులవైపు ఏవైనా పాత కక్షలు మిగిలిపోయాయా అనికూడా ఆలోచించాడు.

ఇంతకూ ఎవరు తనమీద కత్తిగట్టారు?

సీతాపతి గదికి చేరుకొన్నాడు. జేబులోంచి తాళాలు తీసి తలుపులు తెరవబోయాడు.

కాని, ఆ అవసరం లేకపోయింది. అంతకుముందే తన గది యెవరో తెరిచారు దొంగతాళాల్తో. తలుపులు దగ్గరగా చేరవేసివున్నాయి.

తన కాలేజీ చదువు మొదలైన దగ్గర్నుండీ, ఆ గదిలోనే ఉంటూవచ్చాడు. ఎప్పుడూ తనగదిలో దొంగతనం జరగలేదు.

'ఇవాళంతా తమాషాగా ఉంది' అనుకుంటూ గది తలుపులు తోసి లోనికి ప్రవేశించాడు సీతాపతి.

గదంతా చిందరవందరగా ఉంది. తను ఉంచిన ఏ వస్తువూ దాని స్థానంలో లేదు.

అల్మైరాలోని పుస్తకాలన్నీ నేలమీద గిరవాటేసి ఉన్నాయి.

దొంగలు డబ్బుకోసం వెదుకుతూ వాటిని అలా తలక్రిందులుచేసి ఉంటారు.

అల్మైరాలో తను ఉంచిన డబ్బు విధిగాపోయిఉండాలని అనుకున్నాడు సీతాపతి.

ఆశ్చర్యం!

తన డబ్బువుంది అక్కడ. లెక్కపెట్టి చూసాడు. నయాపైసా పోలేదు.

ఐతే, వాళ్లెవరో తన గదిలో ఎందుకు చొరబడినట్టు?

లేకపోతే, వాళ్ళు డబ్బుతీసుకుని పారిపోయేలోపల,

తను వచ్చేసాడా?

అలా కావడానికి వీల్లేదు!

డబ్బుకోసం వచ్చిన వాళ్ళకు, అది కనిపించకపోతే అది వేరే విషయం. తీరా డబ్బు వాళ్ళ కళ్ళబడ్డాక, తీసి జేబులో పెట్టుకోవడం యెంత సేపు?

ఐతే, వాళ్ళెవరో తనగదికి యెందుకు వచ్చినట్టు?

ఆలోచిస్తూ తన మంచంవద్దకుపోయి కూర్చున్నాడు. గత ఆరేళ్ళుగా తను రాస్తున్న డైరీలు మంచంమీద పడి వున్నాయి.

వాటిలో ఒకటిరెండు తెరవబడి మంచంమీద బోర్లించి వున్నాయి.

వాళ్ళెవరోగాని తన డైరీలు చదివారన్న విషయం అర్థమయింది సీతాపతికి.

దేశంలో నేటి ఆర్థిక పరిస్థితుల్ని చర్చిస్తూ, తనకు తోచిన పరిష్కారమార్గాలు వివరించిన పేజీలు ఉన్నచోట డైరీలు తెరవబడి ఉన్నాయి.

తను సామ్యవాద సిద్ధాంతాలకు వ్యతిరేకి. అనేక విద్యార్థి సంఘాల సమావేశాల్లో సామ్యవాదం దేశానికి ఒనగూర్చబోయే నష్టంగురించి ఎన్నోసార్లు మాట్లాడేడు.

ఈనాడు చాలా విద్యార్థి సంస్థలు నాగ్జలిజమ్ చేతిలో ఉన్నాయి.

వాళ్ళెవరికో తన అభిప్రాయాలంటే ఒళ్లు మంటగా ఉండే వుంటుంది. తనమీద కత్తిగట్టి సాధించాలని అందుకే పూనుకుని ఉంటారు.

తనని మాటలతో గెలవలేక చేతలకు దిగివుంటారు. పైగా, తనలాంటి వాళ్ళను తుదిముట్టిస్తేగాని నవసమాజం ఆవిర్భవించదని కదా వారి సిద్ధాంతాలు చెప్తున్నాయి.

తను బహుజాగ్రత్తగా ఉండాలి, అనుకున్నాడు.

3

సీతాపతి పార్కు బెంచీమీద కూర్చున్నాడు. మెల్లగా చల్లగా, హాయిగా వీస్తున్న సాయంపవనాన్ని ఆనందిస్తున్నాడు.

పావుతక్కువ ఏడుగంటలయి వుంటుంది. అప్పుడే దీపాలు వెలిగాయి.

ప్రకృతి సౌందర్యారాధనలో లీనమైన అతని మనస్సుకు అంతరాయం కలిగింది.

సీతాపతి దృష్టి మళ్ళించి చూసాడు.

చిన్న కాయితంవుండ అతనికి తగిలి, నేలమీదపడింది అతని కాళ్ళకు అడుగు దూరంలో.

ఆ ఉండను విసిరిన వ్యక్తి తలవంచుకుని గబగబా వెళ్ళిపోసాగాడు.

ఆ కాగితం వుండ ప్రమాదకరమైనది కాదుకదా? ఆ వుండవైపు నిశితంగా చూసాడు కాసేపు. బూటు కాలితో గట్టిగా తన్నాడు. అది ఎగిరి, అతనికి మరికాస్త దూరంలో పడింది.

యథాలాపంగా ఆ ఉండ విసిరేసి వెళ్ళిన వ్యక్తి దిక్కుకు చూసాడు.

ఆ వ్యక్తి వెళ్ళిపోలేదు.

చెట్లనీడలో తన మొహం దాచుకుని, ఆ ఉండనుతీసి చూడమన్నట్లుగా సైగచేస్తున్నాడు ఆ వ్యక్తి.

తను కూచున్న బెంచీమీంచి ఒక్క దూకు దూకాడు. ఆ వ్యక్తి నిలుచున్న చెట్లవైపుకు.

సీతాపతి ఊహలు అంతకుముందే చదివేసినట్టుగా సీతాపతిలో కదలిక అవుపించగానే ఆ వ్యక్తి రోడ్డుమీదకు దూకి, జనంలో కలిసిపోయాడు.

కాస్సంత నిరాశ చెందాడు సీతాపతి. మళ్ళీ పార్కు

లోకి వచ్చి కూర్చున్నాడు.

ఆ కాయితం వుండ ఇంకా అక్కడే వుంది. మెల్లగా వంగి, వేళ్ళతో అందుకున్నాడు. ఉండ మెత్తగా తెరిచింది. విప్పాడు. అదొక ఉత్తరం, తన పేర్న వుంది.

సీతాపతి చదవనారంభించాడు.

"అన్నయ్యా!"

అలా పిలిచేవారు తన కెవరున్నారు? సీతాపతి ఆశ్చర్యపోయాడు.

"నువ్వు నాకెలా తెలుసని ఆశ్చర్యపోతున్నావు కదూ? ఆపదలో వున్న వాళ్ళను ఆదుకునే నీ సుగుణం గురించి నాకు తెలుసు.

ఓసారి కొందరు రోమియోలు ఓ అమ్మాయిని వెంబడించి అసహ్యంగా మాట్లాడుతూ ఏడ్పిస్తుంటే అది చూసి వాళ్ళకు తగురీతిగా దేహశుద్ధి చేసి బుద్ధి చెప్పావు. అలాగే యింకోసారి, ఈతకొలనులో దిగి చేతులూ కాళ్ళూ ఆడించలేక నిస్సహాయంగా మునిగిపోతూ ఉన్న ఓ కుర్రాడ్ని బయటికి లాగి రక్షించావు.

ఈనాడు నేను పెద్ద ఆపదలో వున్నాను. నన్ను కొంతమంది దుర్మార్గులు ఎత్తుకుపోయారు. నేను సీతమ్మధార శ్మశానానికి దగ్గరగా ఉన్న పాడుబడ్డ దెయ్యాల మేడలో బందీని అయి వున్నాను.

నన్ను ఆ దుండగులు తమ సుఖాల కీలుబొమ్మగా వాడుకుంటున్నారు. అన్నయ్యా! నా భర్తనో, నా తండ్రినో లేదా పోలీసు వాళ్ళనో సహాయం అర్థించక నిన్నే ఎందుకడిగానో అని అనుకోవచ్చు.

పోలీసు డిపార్టుమెంటు సంగతి నేను వేరుగా చెప్పనక్కరలేదు. నీకు తెలుసు. ఇహ నా తండ్రిగాని, నా భర్తగాని నన్ను రక్షించ పూనుకోరు. చెడినదాన్ని

వెనక్కి తెచ్చుకుని, తమ గౌరవమర్యాదలు ఎలా పోగొట్టుకుంటారు వారు?

ఈ ఉత్తరం అందించే వ్యక్తి ఆ ముఠాలో వాడే. కాని, వాడేమీ అనకు. నా మీద యెలాగో జాలికలిగి, యీ మాత్రం సాయం చెయ్యడానికి అంగీకరించాడు.

అన్నయ్యా! వస్తావుకదూ! యీ సోదరిని రక్షిస్తావు కదూ! క్షణాలు యుగాలుగా, రోజులు మన్వంతరాలుగా గడుపుతున్నాను. ఎంత త్వరగా వస్తావో!"

ఇట్లు సోదరి
అనసూయ.

ఉత్తరం చదువుతుంటే సీతాపతి గుండెలు ఆవేశంతో ఊగిపోయాయి. ఆ క్షణంలోనే బయలుదేరి, ఆ అమ్మాయిని బంధించిన ముష్కరుల్ని ముక్కలు ముక్కలుగా నరికి పారేయాలన్నంత ఆగ్రహం వచ్చిందతడికి.

నిగ్రహించుకున్నాడు.

ఆ ఉత్తరం యింకొకరి చేతిలో పడిందంటే చాలా ప్రమాదం. దాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి, రోడ్డు మీదకు వచ్చి, పైడు కాలవలోకి గిరవాటేసాడు.

బరువుగా నిట్టూర్చి గదికి బయలుదేరాడు.

ఆపదలో చిక్కుకున్న అమ్మాయిని ఎలాగయినా రక్షించి తీరాలన్న ఆవేశపు ఉప్పెనతో కొట్టుకుపోయాడు సీతాపతి చాలాసేపు.

ఆమెను యెలా రక్షించాలో పథకాలు వేస్తుంటే, సీతాపతి ఆవేశం కాస్త తగ్గుముఖం పట్టింది. ఆలోచన నిదానంగా సాగింది.

కొంపదీసి, తనను ఉత్తరం మిషతో ఏకాంత ప్రదేశానికి లాక్కొచ్చి, తన్నేందుకు జరుపుతున్న పన్నాగం కాదుకదా ఇది?

దీర్ఘంగా ఆలోచించాడు కాసేపు.

ఒక్కసారి ఉత్తరంలోని విషయాలన్నీ గుర్తుకు తెచ్చుకున్నాడు.

ఆ ఉత్తరం యధార్థమైనదిలాగే కనిపిస్తోంది.

ఒకవేళ, ఆ ఉత్తరం నిజమైనది కాకపోయినా, తన ప్రత్యర్థుల్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం అయినా కలుగుతుంది.

అంచేత, ఆ ఉత్తరం నిజమని నమ్మి వెళ్ళడంలోనే లాభం ఉంది, అనుకున్నాడు.

4

శ్మశానానికి యెడంగా, గుబురుగా, అల్లిబిల్లిగా ఎదిగిన రావి, వేప, మర్రి, పనస, టేకు చెట్లమధ్య ఉంది దెయ్యాల మేడ.

గాలికి విసురుగా ఊగుతున్న చెట్ల కొమ్మల రాపిడి, ఆకుల గలగల శబ్దంతప్ప ఇంకో శబ్దం వినిపించడంలేదు.

"పట్టపగలే ఇంత చీకటిగా ఉంది. రాత్రయితే ఎవరూ అడుగుపెట్టలేరేమో!" అనుకుంటూ మేడలోకి ప్రవేశించాడు సీతాపతి.

నేలంతా దుమ్ము, మట్టి, ఎండిన ఆకులు వగైరా చెత్త పడి అసహ్యంగా, చీదరగా ఉంది. ఎక్కడపడితే అక్కడ విస్తారంగా దట్టంగా సాలెగూళ్ళు అల్లుకుని ఉన్నాయి. గబ్బిలాలు ఎగురుతున్నాయి అటు ఇటూ.

'ఇందులో ఎవరూ ఉంటున్న జాడలేదే!' అనుకుంటూ, మొహానికి, ఒంటికి చుట్టుకుపోతున్న సాలెగూళ్ళను చేతులతో చుట్టి విదిలించుకుంటూ హాలుదాటి, మేడమెట్లు యెక్కసాగాడు సీతాపతి.

అదే సమయంలో పెద్ద శబ్దం అయింది, అతని వెనుగ్గా.

కంగారుగా వెనుదిరిగి చూసాడు.

మేడమీది గోడ కొంత మేర విరిగి నేలగూలింది.

మళ్ళా మరుక్షణంలో భరించలేని నిశ్శబ్దం అలుము కుంది అంతటా.

పాడుబడిన గోడ దానంతటదే విరిగి కూలిందా? లేక ఎవరయినా కూలదోసారా?

ఆలోచిస్తూ మళ్ళా మేడ మెట్లు యెక్కసాగాడు సీతాపతి.

ఇలా మేడమీది వరండాలో అడుగు పెట్టాడో లేదో, రెండు మూడు గదుల తలుపులు ఒకేసారి ఫెళ్ళున కొట్టు కున్నాయి ధనధనామంటూ.

సీతాపతి గుండెలు అదిరిపడ్డాయి.

ఇదంతా దెయ్యాలపని అనుకోవచ్చునా? లేక అన సూయను తను రక్షించడానికి వచ్చినట్టు వాళ్ళకు తెలిసి పోయిందా?

ఏది ఏమైనా తను మరింత జాగ్రత్తగా ఉండాలను కున్నాడు సీతాపతి.

తనతో తెచ్చుకున్న సైకిలు చైను జేబులోంచి తీసి పట్టుకుని, ముందుకు నడిచాడు.

గది తరువాత గది, మేడమీది గదులన్నీ పరిశీలిం చాడు.

ఎక్కడా పిట్ట మనిషి లేదు.

తనను యెవరో ఫూలుని చెయ్యాలనుకున్నారు. సఫలీ కృతులయ్యారు.

చకచకా మేడ మెట్లు దిగి బయటకు వచ్చేసాడు.

తల వంచుకుని, చెట్లక్రిందన నడుస్తుంటే, ఏదో విరిగి పడుతున్నట్టు ఫెళ్ళున శబ్దం అయింది.

మెరుపులా ప్రక్కకు తప్పుకున్నాడు నేర్పుగా.

లేకపోయుంటే, పెద్ద చెట్టుకొమ్మ తిన్నగా వచ్చి అతని తలకాయ బద్దలు చేసేది.

తలెత్తి చెట్లకొమ్మల్లోకి చూసాడు ధైర్యంగా.

కాని, అక్కడ గుబురుగా పెరిగిన చెట్లకొమ్మలుతప్ప మనుషులు కనిపించలేదు అతడికి.

ఏమిటీ విచిత్రం?

తొందరగా నడుచుకుంటూ చెట్లలోంచి బయట కొచ్చాడు సీతాపతి.

5

తన ప్రత్యర్థుల ఉద్దేశం తనను ఫూల్ చెయ్యడమా? లేక తనని తన్ని వదిలెయ్యడమా?

అంతు తెలీని అయోమయావస్థలో కొట్టుకోసాగాడు సీతాపతి.

మనస్సంతా చికాకుగా తయారయింది. కొద్దిరోజులు విశాఖపట్నం వదలి వెళ్ళిపోవాలనిపించింది అతడికి.

వెంటనే తన బ్రీఫ్ కేసులోకి రెండు జతల బట్టలు, ఒక తువ్వాలు, స్లిపింగ్ డ్రస్ సర్దుకుని, విజయవాడలో ఉన్న తన మేనమామ గారింటికి బయలుదేరాడు మద్రాసు మెయిలులో.

ఆవాళ మెడ్రాస్ మెయిల్ చాలా రద్దీగా ఉంది. అన్ రిజర్వుడు ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో ఎలాగో నిలుచోవడానికి జాగా దొరికింది.

'అదే పదివేలు దేవుడా!' అనుకుంటూ, లగేజీరేక్ లో తన బ్రీఫ్ కేసు ఉంచి నిట్టూర్చాడు హాయిగా.

రాత్రి పదిగంటలకు విజయవాడ చేరుకునేంతవరకూ ఆ ఆలోచనలతోనే వేగిపోయాడు సీతాపతి.

స్టేషనుకు సమీపంలోనే, అతని మేనమామ యిల్లు

వుంది. బ్రీఫ్ కేసు చేత బుచ్చుకుని, కులాసాగా నడచి వెళ్లిపోయాడు.

"ఏమిట్రోయ్? ఇంత హఠాత్తుగా ఊడిపడ్డావ్?" అడిగాడు సీతాపతి మేనమామ, సీతాపతిని చూసి.

"ఊరకనే మామయ్యా! నాలుగు రోజులు మీ ఇంటిలో ఉండి వెళదామనిపించింది. ఇలా వచ్చాను" చెప్పాడు సీతాపతి.

రాత్రికి తను వాడుకోవాల్సిన బట్టలు పెట్టెలోంచి బయటకు తీయాలని సీతాపతి బ్రీఫ్ కేసు తెరిచాడు.

సీతాపతి కళ్ళు జిగేల్ మన్నాయి.

ఆ పెట్టెలో మొత్తం యెంతుందోగాని, పెట్టెనిండుగా సరికొత్త నూరు రూపాయల నోట్లకట్టలు పేర్చి ఉన్నాయి.

కాని, తన బట్టలు లేవు.

తన పెట్టెలోకి ఆ డబ్బెలా వచ్చింది?

పెట్టెను అతిజాగ్రత్తగా పరిశీలించాడు.

అది తనదికాదు. అంటే, తన పెట్టె మారిపోయింది.

అయినా, మారడానికి, తన పెట్టెలాంటిది యెక్కడా ఇంకో పెట్టె అవుపించలేదు తనున్న కంపార్టుమెంటులో.

కాని, ఇదెలా సంభవం? ఆలోచించాడు సీతాపతి దీర్ఘంగా.

ఏదో స్టేషనులో పోలీసులు ఎందుకో ప్లాట్ ఫారం మీద తిరుగుతూ ఎవరికోసమో వెదుకుతున్నట్టు ప్రతీ కంపార్టుమెంటులోకి చూసుకుంటూ వెళ్ళారు. అది గుర్తుకు వచ్చింది సీతాపతికి.

ఆం... అదీ సంగతి! అవి దొంగనోట్లు.

వేట కుక్కల్లాగు తన వెంటబడ్డ పోలీసుల్ని చూసి, ఏ క్షణాన్నైనా ప్రేలడానికి సిద్ధంగా ఉన్న టైం బాంబులాంటి నోట్లకట్టల బ్రీఫ్ కేసు తక్షణం తన చేతి

లోంచి వదిలించుకోవడం తప్ప వేరే గత్యంతరం లేదనుకుని ఉంటాడు ఆ వ్యక్తి.

అదే సమయంలో తన బ్రీఫ్ కేసు అవుపించింది. రెండూ ఒకేలా ఉండటం అతని అదృష్టం. మాయ మాటాడకుండా, పెట్టెలు మార్చేసాడు.

అతను తీసుకువెళ్ళిన తన పెట్టెలో తన ఎడ్రసు ఉంది. తన కందించిన డబ్బుకోసం అతను తనని వెదుక్కుంటూ వస్తాడు తప్పకుండా.

ఈలోపున తనే పోలీసులకు హుషారిచ్చి, ఆ వ్యక్తి తనవద్దకు వచ్చేటప్పటికి ఘనమైన అరదండాల స్వాగతం పోలీసుల చేత అందించాలి.

తనకు టైంలేదు. వెంటనే తను విశాఖపట్నం వెళ్ళిపోవాలి మళ్ళా.

"మామయ్యా! నేను ఇప్పుడే విశాఖపట్నం వెళ్తున్నాను. అంతా తరువాత వివరంగా చెప్తాను. నాకు అడ్డు చెప్పకు. వస్తాను" అని చెప్పి హౌరా మెయిలుకు తిరిగి విశాఖపట్నం బయలుదేరాడు.

విశాఖపట్నం చేరుకోగానే, తిన్నగా డి. యస్. పి. ఆఫీసుకు వెళ్ళాడు సీతాపతి.

డి. యస్. పి. ని పెర్సనల్‌గా కలుసుకుని అర్జంటుగా మాట్లాడి తీరాలని కోరగానే అనుమతి వెంటనే లభించింది.

డి. యస్. పి. సమక్షానికి వెళ్ళాడు సీతాపతి.

బ్రీఫ్ కేసు తెరచి నోట్లకట్టలు చూపిస్తూ, తనకెలా ఆ పెట్టె దొరకింది సవిస్తరంగా చెప్పాడు డి. యస్. పి. తో.

"అయితే ఇవి దొంగ నోట్లంటారు?" అన్నాడు డి. యస్. పి. సీతాపతి చెప్పిందంతా విని.

"అనే నా అనుమానం. లేకపోతే, ఇంత డబ్బు నాకు

వదలిపెట్టి, అయిదు వందలయినా చెయ్యాని నా బ్రీఫ్ కేసు ఎత్తుకుపోయే మూర్ఖుడుంటాడా? చెప్పండి.''

సీతాపతి వాదనలోని బలం గుర్తించాడు డి. యస్. పి. ఇద్దరూ కలసి పోలీసు కార్లో మహారాణీపేట స్టేట్ బేంక్ కు వెళ్ళారు.

మేనేజరుకు నోట్లు చూపించి ''ఇవి మంచివో కావో చూసి చెప్పండి'' అని అడిగాడు డి. యస్. పి.

బాంక్ మేనేజరు ఆ నోట్లను అటూ ఇటూ చాలా సేపు చూసి, హెడ్ కాషియర్ ను పిలిపించాడు. ''చూడండి. నిన్న ఇంత మొత్తం ఎవరయినా మన బేంక్ లోంచి డ్రా చేసారా?'' అని అడిగాడు.

''ఉండండి. చూసి వస్తాను'' అంటూ హెడ్ కాషియర్ వెళ్ళిపోయి, అరగంట పోయాక తిరిగి వచ్చాడు.

''నిన్న కాదుగాని మూడు రోజులక్రితం ఎక్సో ఎంటర్ ప్రైజస్ ప్రొప్రయిటర్ శంకర్రావుగారు పది లక్షలు డ్రా చేసారు. వాటి నంబర్లు నావద్ద ఉన్నాయి ఇంకా'' చెప్పాడు హెడ్ కాషియర్. ఆ నోట్లమీద నెంబర్లు, కాషియర్ ఇచ్చిన నెంబర్లు చెక్ చేశారు. ఒక్కటే!

''అంటే, ఇవి మంచి నోట్లన్నమాట!'' ఆశ్చర్యపోతూ అన్నాడు డి. యస్. పి.

అవన్నీ మంచి నోట్లన్న విషయం సీతాపతిని కూడా ఆశ్చర్యంలో ముంచేసింది.

అవన్నీ మంచినోట్లయితే, నోట్లపెట్టెను బదులు తన పెట్టెను ఆ వ్యక్తి యెవరో తీసుకెళ్ళడానికి కారణ మేమిటి? ఆలోచిస్తున్నాడు.

''ఆల్ రైట్ మిస్టర్ సీతాపతి. ఆ డబ్బు యజమాని యెవరో తేలింది. పదండి. అతనికి ఆ డబ్బు ఇచ్చి వచ్చేద్దాం,'' అంటూ డి. యస్. పి, లేవగానే సీతాపతి

కూడా లేచాడు.

ఇద్దరూ బేంక్ మానేజరుదగ్గర శెలవుతీసుకుని బయటకు వచ్చి పోలీసు కారెక్కారు.

వాల్తేరు అప్‌లాండ్స్‌లో ఉన్న శంకర్రావు బంగళాని పోలీసు కారు సమీపించగానే, కారును ఆపి ఇద్దరూ దిగారు.

శంకర్రావు ఇంటివద్దనే ఉన్నాడు. డి. యస్. పీని, సీతాపతిని సాదరంగా లోనికి ఆహ్వానించాడు.

సీతాపతి సోఫాలో కూర్చుంటూ, బ్రీఫ్ కేసు తన ఒడిలో ఉంచుకుంటున్న సమయంలో, శంకర్రావు ఆ పెట్టెను చూసినట్టున్నాడు. "అరే! యీ పెట్టె మీకు దొరికిందన్న మాట!" అన్నాడు ఆశ్చర్యంగా; వెంటనే సీతాపతి చేతిలోంచి పెట్టెను లాక్కుని తెరచి చూసాడు.

"అమ్మయ్య! ఎలా పెట్టినవి అలాగే ఉన్నాయి" అని దీర్ఘంగా నిట్టూర్చి, సీతాపతివైపు తిరిగి "మీ బ్రీఫ్ కేస్ తీసుకొస్తానుండండి" అంటూ లేచి లోనికిపోయి సీతాపతి బ్రీఫ్ కేసు తెచ్చి అందించాడు.

సీతాపతి తన పెట్టె అందుకుని తన వస్తువులు సరి చూసుకున్నాడు.

"మావాడు మహానిర్లక్ష్యంగా తయారయ్యాడండి. బాంక్‌లోంచి డబ్బు డ్రాచేసి యింటికిచ్చి వెళ్ళిపోక, అలా తుని వరకు వెళ్ళి వచ్చాడట. త్రోవలో యీ గల్లంతు జరిగింది" అన్నాడు శంకర్రావు సంజాయిషీ చెప్పుకుంటున్నట్టుగా.

సీతాపతి జ్ఞాపకం తెచ్చుకోసాగాడు. తన పెట్టె లాంటి పెట్టె పట్టుకుని ఎవరయినా తన కంపార్ట్‌మెంటు ఎక్కారా అని!

ఎవరూ ఎక్కినట్టు తనకు గుర్తులేదు. ఆ వ్యక్తి ఎవ

రయినా, తన పెట్టె ప్రక్కన అతని పెట్టె పెట్టివుంటే, తనకు గుర్తు వుండివుండేది. అలాంటిదేమీ జరగలేదు.

అంటే శంకర్రావు అబద్ధం చెబుతున్నాడా? చెబితే ఎందుకు చెబుతున్నట్టు?

ఏమో, ఏం జరిగిందో, అంతా అయోమయంగా వుంది తనకు.

“వస్తానండి” అంటూ లేచాడు సీతాపతి. చేతులు జోడించి శంకర్రావుకు నమస్కరించాడు.

డి. యస్. పి. కూడా లేచాడు.

ఇద్దరూ పోలీసుకారు యెక్కారు.

6

రెండు నెలలపాటు యూనివర్సిటీకి శెలవులు ఇచ్చారు.

రెండు రోజులపాటు స్వగ్రామం శృంగవరపుకోటలో ఉండి వద్దామనుకున్నాడు సీతాపతి.

చిన్న సూటుకేసులోకి బట్టలు సర్దుకుని, శృంగవరపుకోట వెళ్ళాడు.

ఊరికి దూరంగా శివాలయం. గెడ్డ ఒడ్డు. పుణ్యగిరి అడవులు. శృంగవరపుకోటలో ఉన్నాళ్ళు రోజూ సాయంకాలం పుణ్యగిరి కొండల వైపుకు షికారుకు పోవడం సీతాపతికి అలవాటు. చాలా యిష్టం కూడా.

ఆ రోజు సాయంకాలం నాలుగు గంటలవుతుండగానే పుణ్యగిరి వైపుకు బయలుదేరాడు సీతాపతి.

ఆకాశం అంతటా నల్లని మబ్బులతో దట్టంగా మూసుకుని ఉంది. ఏ క్షణాన్నైనా వర్షం కురవవచ్చు.

సీతాపతి శివాలయం దాటుతుంటే చిన్న తుంపర పడసాగింది.

అయినా అతను వెనుదిరగ దల్చుకోలేదు. తను

వెనక్కి మళ్ళగానే వర్షం తేలిపోవడం మామూలు.

అందుకే, ముందుకు నడిచిపోసాగాడు.

పాతిక గజాల దూరం వెళ్ళాడో లేదో, వర్షం యెక్కువయ్యింది. ఇంకో అయిదు నిముషాలు తను అలా నడిచాడంటే తడిసి ముద్దవడం ఖాయం.

కాసేపు ఎక్కడయినా, తలదాచుకుంటే, వర్షం తగ్గాక తిరిగి తన షికారు కొనసాగించవచ్చు.

నలువైపులా చూశాడు సీతాపతి. ఫర్లాంగు దూరంలో వున్న దిబ్బమీద ఓ పూరిపాక కన్పించింది.

ఒక్క పరుగులో అక్కడకు చేరుకున్నాడు క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా.

వర్షం ఉధృతమైంది. హోరున కురుస్తోంది. పది నిముషాలు గడిచాయి.

'దీని తీరుచూస్తుంటే అరగంటలోకూడా తగ్గేటట్టు లేదు' సీతాపతి అనుకుంటుంటే, పాక అవతల ఎవరివో తడిసిన పాదాలు అవుపించాయి.

'ఎవరు చెప్మా?' అని అనుకుంటుంటే, నెత్తిన గడ్డి గంప పెట్టుకొన్న ఒకామె వర్షంలో తడిసి ముద్దయి పోయి లోనికి వచ్చింది.

వస్తూనే, "ఏటి బాబూ! మీరున్నారా యిక్కడ?" అంటూ పలకరించింది సీతాపతిని.

సీతాపతి ఆశ్చర్యపోయాడు.

ఆమె ఎవరో తనకు తెలీదు. ఆమెను తను ఎన్నడూ చూసినట్టు గుర్తులేదు.

సీతాపతి బదులివ్వలేదు.

ఆమె నెత్తిమీద గడ్డిగంపను ఓ మూలగా పడేసి, చేతిలోని కొడవలిని విసురుగా అందులో తోసింది.

ఓ క్షణం పోయాక, కాలక్షేపం కోసం అడిగాడు:

"నేను మీ కెలా తెలుసు?"

"అదేటి బాబూ! మీరు నాకు తెలేదటి? మీరు వెంకట పతి రాజుగోరి అబ్బాయిగోరు కాదేటి?" అంది.

అవును! ఆమె చెప్పింది నిజమే! అయినా ఆమె తనకు తెలీదు.

ఆ మాటే మృదువుగా అన్నాడు, ఆమె యెక్కడ బాధపడిపోతుందో అని.

"మీరు సదువుకుంతన్రుగందా! మాలాటోల్లు గేపకం ఉండరు. నాను పోకిరి సింహాచలం కూతుర్నండి. గడ్డి బరకలకొత్తే, వోన ఒట్టుకుంది" చెప్పింది ఆమె.

పోకిరి సింహాచలం యెవరో సీతాపతికి తెలుసు. అతను తాలూకాఫీసులో బంట్రోతుగా పనిచేస్తున్నాడు.

కాని, అతని కో అమ్మాయి వున్నట్టు, అందునా, చంద్రవంకలా అందాలు చిందే కూతురున్నట్టు తనకు తెలీదు.

"ఓహో! అలాగా!" అన్నాడు బయటికి, మనస్సులో ఎలాంటి భావాలు మెదులుతున్నా.

"అదేటి బాబూ! నిలుచుండిపోన్నేటి? కూకోండి" అంటూ పాకలో ఎక్కడో మూలనున్న ఓ చింకిగోనె బయటకు లాగిపడేసింది.

సీతాపతి అయిష్టంగా దానిమీద కూచున్నాడు. అప్పుడు చూసాడు ఆమెను నిశితంగా.

ఆమెకు యిరవై యేళ్లుంటాయి. చామనచాయలో వున్నా ఆకర్షణీయంగా ఉందామె.

తడిసిన బట్టల్లోని ఆమె శరీరం నిగారింపులు అతని మగతనాన్ని అల్లరిపెట్టసాగాయి. అయినా నిగ్రహించుకున్నాడు. ధ్యాస వర్షం మీదకి మళ్ళించుకున్నాడు.

కాని, ఆమె అతని నిశ్చలతను భగ్నం చేసింది.

భుజంమీది పైటను చేతిలోకి తీసుకుని, నడుంవరకూ ఉన్న చీరను వుండగా చుట్టి, నీళ్ళు పిండుతూన్న నెపం మీద ఏపుగా ఎదిగిన తన గుండెలమీది కండల్ని అతనికి ప్రదర్శింపసాగింది.

వేరే దిక్కుకు తన మొహం త్రిప్పుకుని, ఆమెను గమనించనట్టు నటించసాగాడు సీతాపతి.

"మాట!" ఆమె పలికింది.

ఆమె బట్టలు పిండుకునే కార్యక్రమం కానిచ్చిందనుకున్నాడు సీతాపతి. ఆమె వైపు తిరిగాడు.

ఆమె యింకా నడుంవరకూ పూర్తిగా నగ్నంగావుంది.

పాకు తిన్నవాడిలా మళ్లా మొహం త్రిప్పుకున్నాడు సీతాపతి.

ఆమె పగలబడి నవ్వింది. అసలే ఎత్తయిన ఆమె గుండెలు యింకా ఎగిరిపడ్డాయి.

"ఏటలా సుట్టుకుపోతున్రు. సిగ్గు నాకుండాలి మీకు కాదు" అంది ఆమె ఇంకా నవ్వుతూనే.

సీతాపతికి ఒళ్ళు మండిపోయింది. అయినా ఆమె ఆడది! ఏం చెయ్యగలడు?

వర్షాన్ని తిట్టుకుంటూ కూచున్నాడు.

"బయిట మా పెద్ద వోన. లోపల సలిసలిగా వుంది. ఎచ్చగా తొంగుందాం. రారామూ?" అడిగింది ఆమె అతనికి చేరువగా వస్తూ.

పిండి విడిలించిన చీర ఒంటిమీద కప్పుకున్నా, ఆమె ఇంకా నగ్నంగానే అవుపిస్తోంది, బట్ట ఆమె ఒంటిని అతుక్కుపోయి.

సీతాపతి మాటాడలేదు. రాయిలా కదలకుండా కూచున్నాడు.

“ఏటి? పలకవేటి? నా నేటంతన్నానో ఇన్పించనే దేటి?” అంటూ ఆమె సోంగోని అతని చుబుకం పట్టుకుని మొహాన్ని తన వైపుకు త్రిప్పుకోవాలని ప్రయత్నించింది.

సీతాపతి సహనం కోల్పోయాడు. చివాలున లేచి నించున్నాడు.

ఆమెను వదిలించుకోవాలన్న అతని వుద్దేశం ఆమె ఊహించిందేమో, అదనుకని పెట్టి అతని గుండెలమీద వాలిపోయి, బలంగా అతన్ని కౌగిలిలో బిగించింది.

రాబోతున్న ఉప్పెన ఊహించాడు సీతాపతి. తనను చుట్టివేసిన ఆమె చేతుల్ని కర్కశంగా లాగేసి “ఛీ! ఛీ! ఆడదానివి ఇంత తెగింపా?” అంటూ ఆమెను ప్రక్కకు నెట్టేసి, భోరున కురుస్తున్న వర్షంలో బయటకు వచ్చేసి, ఇంటిత్రోవ పట్టాడు.

7

అవాళ రాత్రి ఎనిమిది గంటల సమయమప్పుడు ఏదో అవసరముచ్చి తన పాంటుజేబులో చెయ్యి పెట్టుకున్నాడు.

అతడి చేతికో కాయితం తగిలింది.

బయటకు తీసి విప్పి చదివాడు ఆశ్చర్యంతో.

“ఒరేయ్ ఫూల్!

‘కోరివచ్చిన ఆడదంటే అతిచులకన మగవాడికి’ అన్న మాట పాతపాట. అయినా నాకు తెలీక అడుగుతాను– బత్తాయిలాంటి అమ్మాయి ఎదురుగా నిలుచుని ‘రా! రా!’ అంటూ మీద పడుతున్నా వదిలించుకుపోయావంటే, నీకేదైనా శారీరక లోపం ఉందా? నా మాట విను. పెళ్ళిచేసుకోకు. ఒక ఆడదాని ఉసురు పోసుకోకు.

ఇట్లు

భగ్నప్రణయని.”

సీతాపతి తల తిరిగిపోయింది.

క్షణికోద్రేకంతో ఆమె నీతి తప్పుతుంటే తను మెల కువగా ప్రవర్తించి, ఆమెను నైతిక పతనంనుంచి రక్షించాడు. అందుకు ఫలితం ఆమె తన మగతనాన్నే సందేహిస్తోంది.

సీతాపతికి కోపం పొంగుకొచ్చింది.

వెంటనే వెళ్ళి ఆమెను చీవాట్లు పెట్టిన స్తేనేగాని, అతని కోపం చల్లారేటట్టులేదు!

ఉన్నపళంగా సింహాచలం ఇంటికి బయలుదేరి వెళ్ళాడు.

"మీ అమ్మాయి వుందా ఇంట్లో?" కోపంగా అడిగాడు సీతాపతి.

"ఎవరు బాబూ!...మీరా!...ఎవరు?...అమ్మాయా! నాకు కూతుళ్ళు లేరు బాబూ! అందరూ కొడుకులే" చెప్పాడు సింహాచలం ఇంట్లోంచి బయటకు వచ్చి.

"మరి...ఇందాక...పాకలో..." ఇంకా ఏదో అనబోయాడు సీతాపతి. కాని ఆగిపోయాడు.

అప్పుడు గుర్తొచ్చింది సీతాపతికి, తనకు జరిగిందంతా ఓ ఫూలింగు అని.

ఆమె తనతో ఒక పల్లెటూరి అమ్మాయిలా మాట్లాడింది. కాని, ఆమె వుత్తరం? బాగా చదువుకున్న అమ్మాయి రాసినట్టుగా వుంది.

రంగులు మారుతున్న సీతాపతి మొహం చూసి "ఏమిటి బాబూ! ఏంటి జరిగింది?" అంటూ ఏదో అనుగుతున్నాడు సింహాచలం.

కాని, సీతాపతి అక్కడ లేడు. ఇంటికొచ్చిపడ్డాడు.

ఆమె రాసిన ఉత్తరం మళ్ళా చదివాడు. ఆ ఉత్తరం బట్టి చూస్తే, ఎవరో అమ్మాయి తనను కోరి, పల్లెటూరి అమ్మాయి వేషంలో వచ్చి ఆకర్షించబోయింది. కాని,

తను లొంగలేదు.

వేషం వేసుకొనివచ్చి ఆమె తనను ఆకర్షించడంలో ఆమె ఉద్దేశం యేమిటి? తన్ను నేరుగా వచ్చి అడిగేయ్యొచ్చునే!

అప్రయత్నంగా సీతాపతి చూపులు ఉత్తరంలో ఒక చోట పడ్డాయి.

'భగ్న ప్రణయని' ఆమె సంతకం చేసిన చోట లేత నీలం రంగులో ఓ ముద్ర ఉంది.

ఒక అగ్నిగుండం. అందులో ఓ హస్తం పాముల్ని పడేస్తోంది.

ఏమిటి దీని అర్థం? ఎవరిదీ చిహ్నం? సీతాపతి దీర్ఘంగా ఆలోచించాడు.

తనమీద ఏదో ముతా నిషూ వేసింది. దానిదే ఆ చిహ్నం! ఐతే ఎందుకు? తను వాళ్ళకు చేసిన ద్రోహం గాని అన్యాయంగాని యేమిటి?

ఆ ప్రశ్నలకు సమాధానం కనుక్కుంటేగాని, తను శాంతంగా ఉండలేడు.

మర్నాడు ఉదయం బస్సుకే విశాఖపట్నం బయలు దేరాడు సీతాపతి.

తనకు అత్యంత సన్నిహితంగా ఉన్న తన బాక్సింగ్ క్లబ్ మెంబర్లకు, యూనివర్సిటీలో తనకు బాగా తెలిసిన ప్రొఫెసర్లకూ, తన తోటి విద్యార్థులకూ ఆ ముద్రను చూపించాడు.

ఎవరూ కూడా ఏ సంగతీ చెప్పలేకపోయారు.

సీతాపతి నిరాశ చెందలేదు.

శృంగవరపు కోటలో తనను సెడ్యూస్ చెయ్యబోయిన ఆ అమ్మాయి కనిపిస్తే తను గుర్తుపట్టగలడు. కాని, ఆ అమ్మాయి మళ్ళా అవుపిస్తుందా అన్నదే పెద్ద ప్రశ్న.

ఏది ఏమైనా తనకు జరిగిన విచిత్రమైన సంఘటన లన్నింటిలోనూ, తనకు తెలియవచ్చిన పేరు శంకర్రావు ఒక్కటే.

తన వెంటబడిన ముఠాకీ, అతనికీ ఏదో సంబంధ ముండాలి.

తిన్నగాపోయి శంకర్రావునే అడిగాడు. "ఈ ముద్ర ఏ పార్టీకి సంబంధించిందో చెప్పండి" అంటూ.

"ఏమో నాకేం తెలుసు. అయినా, తిన్నగా వచ్చి నన్నే అడిగే ధైర్యం నీ కెలావచ్చింది?" కళ్ళు పెద్దవిచేసి కోపంగా చూస్తూ అన్నాడు శంకర్రావు.

సీతాపతి అవాక్కయిపోయాడు.

మంచిగా, మర్యాదగా అడిగితే శంకర్రావునుంచి సమాధానం పొందడం కష్టం అన్నది సీతాపతికి అర్థమైంది.

అంతేకాదు!

శంకర్రావు మాట్లాడేతీరు చూస్తుంటే, అతనికీ, ఆ యొక్క ముఠాకూ సంబంధం వున్నదన్నది స్పష్టమైంది.

అప్పటిమట్టుకు మాట్లాడకుండా శంకర్రావు ఇంటి నుంచి వచ్చేసాడు సీతాపతి.

8

రాత్రి ఒంటిగంట దాటింది.

రోడ్డుప్రక్కనున్న చెట్లనీడల్లోంచి, శంకర్రావు ఇంటిని జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు సీతాపతి.

అప్పటికి గంటనుంచి ఆ ఇంటి ముందు బీటువేసి వున్నాడు. శంకర్రావు ఇంటిలోని ఆఖరిదీపం ఆరిపోయి అరగంటపైగా అయింది.

రోడ్డుకు అటూ ఇటూ చూసాడు. ఎక్కడా జన సంచారం లేదు.

శంకర్రావు ఇంటి ప్రహారీదాటి అవతలకు చేరుకున్నాడు.

లైట్లు ఆర్పేసినా, ఇంటికి వెలుపలవున్న తోటలో ఎవరయినా ఉన్నారేమోనని కాసేపు చెవులు రిక్కించి విన్నాడు.

గాలికి ఊగుతున్న చెట్ల ఆకుల గలగలలుతప్ప ఇంకో శబ్దం వినరావడంలేదు.

శంకర్రావు ఇంటికి రెండు పర్యాయములు వచ్చాడు సీతాపతి. చూచాయగా ఆ ఇంటి తీరు తెలుసు.

నీటిపైపు నాధారంగా చేసుకుని, మేడమీదకు ఎగబ్రాకాడు.

మేడమీద బాల్కనీలో నిలబడి లోనికి చూసాడు. బాల్కనీకి ఆనుకున్న గదిలో మందంగా దీపం వెల్గుతోంది.

గది మధ్యలోవున్న మంచంమీది పరుపుమీదఎవరో నిద్రపోతున్నారు.

వరండావైపు తెరచివున్నాయి ఆ గది తలుపులు.

లోనికిపోవడం సీతాపతికి అందుకే కష్టంకాలేదు.

గదిలోవున్న బీరువాల్లోను, టేబిలు సొరుగుల్లోను తనకు కావాల్సిన విషయం గురించి వెదకసాగాడు.

ఏవేవో పుస్తకాలు, ఆఫీసు కాయితాలు, ఫైళ్ళు అవుపించాయిగాని, వాటిమీద ఎక్కడా, తను చూసిన ముద్ర కనిపించలేదు.

అతనిలో నిరాశ తొంగిచూసింది. అయినా, పట్టు వదలలేదు.

ఆ గదిలో మరికొన్ని రేక్సు, అల్మైరాలు ఉన్నాయి. వాటివైపుకు కదిలాడు సీతాపతి.

ఒకొక్క పుస్తకం, ఫైలు తెరచి చూడసాగాడు.

విసుగొస్తోంది. ఐనా తెచ్చిపెట్టుకుంటున్నాడు ఉత్సాహం.

చివరకు అతని ప్రయత్నం ఫలించింది. ఉత్తరం మీదున్న ముద్రవంటి ముద్రలుగల ఓ ఫైలు కనిపించింది.

ఆ ఫైలు సంకకిరికించుకుని, తన అదృష్టానికి పొంగి పోతూ, అక్కడనుంచి వెళ్ళిపోవడానికి వెనుదిరిగాడు.

అంతే!

అతని తలమీద ఏదో బరువుగా, బలంగా పడి ఫట్‌మంది.

సీతాపతి కళ్ళముందు పచ్చని వెలుతురు ముద్ద ముద్దలుగా అవుపించి, మరుక్షణంలో పుంజెడు చుక్కలుగా మారిపోయి అదృశ్యమయ్యాయి.

అతని కళ్ళముందు చిక్కని నల్లని చీకటి తెర నిలిచింది.

సీతాపతి స్పృహకోల్పోయాడు.

9

సీతాపతికి స్పృహవచ్చింది. కళ్ళు తెరచి చూసాడు. ఎదురుగా సోఫాలో శంకర్రావు కూచునివున్నాడు. అతని ప్రక్కన అతని వయస్సువాడే ఒక అపరిచిత వ్యక్తి ఉన్నాడు.

"ఏమిటిది శంకర్రావుగారూ! ఎందుకు నన్ను కొట్టించారు?" అడిగాడు సీతాపతి ఆవేశంగా.

"ఆవేశపడకు మిస్టర్ సీతాపతీ! అంతా చెప్తాను. ఉన్నచోటున విశ్రాంతిగా కూచుని అంతా విను" చెప్పాడు శంకర్రావు.

"అలాగే! చెప్పండి. నా వెంట ఎందుకిలా పడుతోంది మీముఠా? నాకు డబ్బులేదు. నాకు ప్రభుత్వ రహస్యాలు తెలియవు..." ఇంకా ఏదేదో చెప్పబోయాడు.

ఉద్రేకం తగ్గించుకోమంటూ, శంకర్రావు చెయ్యి ఊపగానే సీతాపతి ఆగిపోయాడు.

"ఈయన పేరు ఈశ్వరరావు. నాకు ప్రాణస్నేహితుడే గాకుండా, నా వ్యాపారా లన్నింటిలోనూ ఇతడు భాగస్థుడు. మే మిద్దరం కలిసి చెయ్యని వ్యాపారం లేదు. చూడని ఊరులేదు. అనుభవించని ఆనందంలేదు. అదంతా గతం. ఇప్పుడు వ్యాపారాన్ని మా కుర్రాళ్ళకు అప్పజెప్పి విశ్రాంతి తీసుకుంటున్నాం.

వా ల్తేరు అవ్ లాండ్స్‌లో మాలాంటి ధనికవృద్ధులకు ఓ క్లబ్బు వుంది.

ఓరోజు కబుర్లలో మా ఈశ్వర్రావు ఏమన్నాడంటే మన నిఘంటువుల్లోంచి నీతి, నిజాయితీ, మంచితనం, న్యాయం మొదలైన పదాలు తీసెయ్యాలి అని. ఏం? అని నేను ప్రశ్నించాను.

ఈ రోజుల్లో నీతిపరుడు ఎవడన్నావుంటే వాడు అస మర్థుడైనా అయివుండాలి, లేదా వాడికి అవకాశాలు దొరక్కపోయేనా ఉండాలి, అన్నాడు.

అంటే, నీ ఉద్దేశంలో యీనాడు అందరూ దగుల్బా జీలు, దోపిడీదొంగలు, ఘండాకోర్లు అంటావు, అని అడి గాను.

అవును! మనందరం పెద్దమనుషుల బురఖాలు వేసు కొన్న బందిపోటు దొంగలం, అన్నాడు ఈశ్వరరావు.

నాఒళ్ళు మండిపోయింది. ఈ లోకంలో కొంతమంది అవినీతిగా బ్రతుకుతున్నారంటే, నాకు బాధ కలగక పోను. పోనీ, చాలామట్టుకు అని అన్నా ఏదో సర్దిపుచ్చు కునేవాడ్ని. అందరూ అంటున్నాడు. అలా వాడు అంద రికీ ఒకే లేబిలు తగిలించడం భరించలేకపోయాను.

ఈ లోకంలో కొంతమందైనా మంచివాళ్ళు, నిజా యితీపరులు, న్యాయంకోసం పడిచచ్చేవారు లేకపోలేదు అని గట్టిగా వాదించాను. ఒప్పుకోను! ఒప్పుకోను!

అంటూ మొండిగా వాదించాడు ఈశ్వర్రావు.

మాకు రుజువు కావాలి!

అందుకు మేమిద్దరం ఒక పథకం వేసాం. మా క్లబ్బులో ఉన్న మిగతా సభ్యుల సహాయం కోరాం. వారుకూడా మా పథకంలో ఆసక్తి చూపారు.

ఈ పథకం చివరకంటూ అయ్యేఖర్చు నేను భరిస్తాను. ఒకవేళ, ఈశ్వరరావు ఓడిన పక్షంలో, ఆ ఖర్చంతా వాడు ఇచ్చుకోవాలి. ఈశ్వర్రావు 'ఓకే' అన్నాడు.

పాత భావాలు, పాతకాలపు ఛాదస్తాలకు బానిసలు ముసలివాళ్ళు. అందువల్ల మేం కుర్రవాళ్ళనే ఎన్నుకున్నాం.

ముందుగా విశాఖపట్నంలోని కుర్రవాళ్ళతో మొదలు పెట్టదల్చుకున్నాం.

ముందు ఆ యువ కుర్రవాళ్ళల్లో మంచితనం, నీతీ నిజాయితీలమీద నమ్మకం ఉందో, లేదో తెలుసుకోవాలిగా. రకరకాల పత్రికా విలేఖర్ల పేరున కొంతమందిని పంపించి కొంతమంది కుర్రాళ్ళను ఎన్నుకొన్నాం మా పరీక్షకు.

కొంతమందికి నాలికమీద మాత్రం విశాల భావాలు ఉంటాయి. కడుపులో అన్నీ సంకుచిత భావాలే.

వారివారి ఇళ్ళల్లోకి పంపి వాళ్ళ డైరీలు చదివించాం.

తనకు నష్టం కలగనంతవరకూ ప్రతివాడు మంచివాడు, శాంత స్వభావుడు, దుడుకుతనం లేనివాడు.

అమాంతం నలుగురు గుండగులు మీదపడి అన్యాయంగా కొట్టబోతే, ఎలా వుంటుందో అందుకే చేయించిచూసాం.

కొంతమంది, తమ ఒంటిమీద మొదటిదెబ్బ పడగానే ఉగ్రులైపోయారు. ఐతే, గుండగులు బలవంతులని తెలియగానే కాళ్ళబేరానికి దిగారు. సూక్ష్మంగా వారిస్వభావం తెలియపర్చిందేమంటే తమ మంచితనం తాలూకు ప్రదర్శన

తమకన్నా బలవంతులైన వాళ్ళవద్దే.

ఆపదల్లో వున్న వాళ్ళను ఆదుకోవడం అన్నది సుగుణమే. రైల్వేకంపార్టుమెంటులో కూచుని అందరూ చూస్తుండగా అడుక్కున్న వాళ్ళకు డబ్బులు వేసే వాళ్ళల్లా, కొంతమందికి మెప్పుకావాలి. నలుగురూ చూసి తమని "ఓహో!" అనాలి.

అదే గుప్తసహాయం చెయ్యమన్నా, ఒకవేళ సహాయం చెయ్యడంవల్ల తమకు కష్టాలొస్తాయి అని తెలిసినా, వారి కరుణాహృదయం మరి కరగదు.

అనసూయ ఉత్తరం, దయ్యాలకొంప వ్యవహారా పరీక్ష అది ఋజువు కావడానికే చెయ్యబడింది.

ఇహ, కాంతా కనకాలంటే, ఈ రోజుల్లో వెర్రివాళ్ళు కానివాళ్ళు లేరు.

అమాంతంగా పదిలక్షలు తమకు దొరికితే ఎలా ఉంటుంది? అకస్మాత్తుగా, అప్సరసలాంటి అమ్మాయి అనువైన ప్రదేశంలో ఒంటరిగా కనిపించి ఊరించి రమ్మంటే ఎలా ఉంటుంది?

ఆ పరీక్షల్లోనూ నువ్వు నెగ్గావు. మేము సృష్టించిన అగ్నిగుండాలన్నింటినీ జయప్రదంగా దాటావు. మిస్టర్ సీతాపతీ! నాపందెం గెలవడానికి నువ్వే కారణం. నీతో పాటుగ మేం పరీక్షకు తీసుకొన్న వాళ్ళందరూ, ఒక సంఘటనలో కాకపోయినా, రెండో సంఘటనలో లొంగిపోయారు.

నీలాంటివాళ్ళు ఇంకా ఈ భూమ్మీద ఉండబట్టే, ఇంకా దయ, జాలి, కరుణ, న్యాయం ఉన్నాయి బ్రతికి."

అంటూ శంకర్రావు తన సోఫాలోంచి లేచివచ్చి, సీతాపతిని గాఢంగా కవుగిలించుకున్నాడు.

సీతాపతికి నోటమాటలేదు. కొయ్యబొమ్మలా ఉండి పోయాడు.

ఈశ్వర్రావుకూడా లేచివచ్చి, సీతాపతిని అభినందించాడు.

10

"మిస్టర్ సీతాపతీ! నాదో ప్రపోజల్ వుంది. ఆలోచించి చెప్పండి" అన్నాడు ఈశ్వర్రావు.

"చెప్పండి" అన్నాడు సీతాపతి.

"మా శంకర్రావు ధర్మమా అని మిమ్మల్ని కనుగొన్నాం. త్వరలో కాకినాడలో మా కంపెనీ తాలూకు బ్రాంచి ఒకటి తెరవబోతున్నాం. దానికి మిమ్మల్ని మేనేజరుగా నియమించదల్చుకున్నాం. ఏమంటారు?" అన్నాడు ఈశ్వర్రావు.

"వెరీగుడ్ ఐడియాగా నీది" అంటూ మెచ్చుకున్నాడు శంకర్రావు.

నిదానంగా కాసేపు ఆలోచించి, "ముందుగా నన్ను అసిస్టెంటు మానేజరుగా తీసుకోండి. అనుభవం గడించుకుంటాను. రెండుమూడు సంవత్సరాలు నా పనితనం చూశాక, ఆమీదట మీకు నచ్చితే నన్ను మానేజర్ను చెయ్యండి" అన్నాడు సీతాపతి నెమ్మదిగా.

సీతాపతి సమాధానం వింటూనే "సెభాష్! ఆఖరి పరీక్షలోకూడా విజయుడయ్యావు" అంటూ చప్పట్లు చరిచాడు ఈశ్వర్రావు.

"అదేంరా?" నివ్వెరపోతూ అన్నాడు శంకర్రావు.

"ఒరేయ్! నువ్వు అన్ని పరీక్షలూ పెట్టావు. స్త్రీ వ్యామోహం ధనాకాంక్ష ఉన్నాయో, లేదో చూసావు. కాని, మనవాడికి అధికారవాంఛ ఉందో లేదో పరీక్ష

చెయ్యలేదు. నీకు మా నేజరు పదవి ఇస్తాను అంటే అతని రియాక్షన్స్ ఎలా ఉంటాయో చూసాను. నాకు బాగా నచ్చాడు ఈ వ్యక్తి. అతనికి అసిస్టెంటు మేనేజరు ఉద్యోగం ఇచ్చేద్దాం," అన్నాడు ఈశ్వర్రావు.

సీతాపతి కృతజ్ఞతాపూర్వకంగా వాళ్ళిద్దరికీ నమస్కరించి, ఆనందంతో ఇంటికి బయలుదేరాడు.

—:ఐపోయింది:—